ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 5 జనవరి 2025





ముగ్గులను పరిశీలిస్తున్న ప్రత్యేక అతిథి స్వాతీశంకర్, న్యాయ నిర్ణేతలు



శ్రీకాకుళంలో నిర్వహించిన ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు, యువతులు

ముగ్గులు పూచే.. ముచ్చట గొలిపే..

- శ్రీకాకుళంలో కన్నుల పండువగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు, యువతులు

సంక్రాంతి సమీపిస్తున్న వేళ ముగ్గులతో సప్తవర్ణ శోభితమైంది సిక్కోలు. మహిళలు, యువతులను ప్రోత్సహించేలా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో శనివారం శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ మునిసిపల్ హైస్కూల్ మైదానంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలకు విశేష స్పందన కనిపించింది. 'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్' నిర్వహించిన సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలకు.. 'గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)' సహకారం అందించాయి. మహిళామణులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో హాజరై... ఉత్సాహంగా ముగ్గుల పోటీలో పాల్గొన్నారు. సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే ముగ్గులతో తమ నైపుణ్యాన్ని చాటుకున్నారు. విభిన్న వర్ణాలతో రంగవల్లికలను తీర్చిదిద్ది.. నగదు ప్రోత్సాహకాలు, బహుమతులు అందుకున్నారు.

6లో

1 ప్రథమ స్థానం సాధించిన పత్తి జ్యోతి వేసిన ముగ్గు

2 ద్వితీయ స్థానం సాధించిన ఆశ ప్రవీణ్ వేసిన ముగ్గు

3 తృతీయ స్థానం సాధించిన నౌగాపు భవానీ వేసిన ముగ్గు

17 మందితో నెట్టుకొస్తున్నాం

- పలాస కిడ్నీ ఆసుపత్రిపై కలెక్టర్ సమీక్ష
- రేడియాలజిస్ట్, కార్డియాలజిస్టులు లేరు
- సమస్యలు వివరించిన సూపరింటెండెంట్

6లో

వ్యసనాలకు బానిసై.. దొంగగా మారి..

- రైలులో ప్రయాణించే ఒంటరి మహిళలే టార్గెట్
- బంగారు ఆభరణాల చోరీ
- రైల్వే పోలీసులకు చిక్కిన డిగ్రీ విద్యార్థి

6లో



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, విప్ అశోక్

అత్యుత్తమ విద్యనందిస్తాం

- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు
- ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

సోంపేట, జనవరి 4(ఆంధ్రజ్యోతి):విద్యార్థులకు అత్యుత్తమ విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. బారువ జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్, కలెక్టర్ స్వప్నికల్ దినకర్ వుండ్కర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. 'టీడీపీ ప్రభుత్వ హయాంలో 2014-2019 మధ్య ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ఉండేది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆపేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పునఃప్రారంభించాం. ఈ పథకం కారణంగా డ్రాపౌట్స్ తగ్గుతాయి. జిల్లా అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఇందులో భాగంగా ఎయిర్‌పోర్టు, పరిశ్రమలు తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నాం. వీటివల్ల స్థానికులకు ఉపాధి లభిస్తుంద'ని తెలిపారు. బారువ బీచ్‌ను సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. బారువ కళాశాలకు ప్రహరీ నిర్మించడంతో పాటు క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం తుగ్లక్ నిర్ణయాలతో విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిందని తెలిపారు. దీనిని గాడిలో పెట్టేందుకు సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన పథకం మెనూలో మార్పులు కావాలంటే తెలియజేయాలని, ప్రభుత్వానికి నివేదిస్తా మని తెలిపారు. విద్యార్థులు చదువుపై దృష్టిపెట్టాలని, బాల్య వివాహాలకు దూరంగా ఉండాలన్నారు. జిల్లాలో 18 ఏళ్ల లోపు బాలికలు 172 మంది గర్భం దాల్చారని, ఇది మంచి సంప్రదాయం కాదన్నారు. ప్రేమ పెళ్లిళ్లే దీనికి కారణమని, దీంతో వారి చదువు అర్ధాంతరంగా ముగిసిపోతుందన్నారు. ఇలాంటి వాటిని అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు.

రేపు సిక్కోలులో డ్వాక్రా బజార్ ప్రారంభం

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ మునిసిపల్ హైస్కూల్ మైదానంలో సోమవారం డ్వాక్రాబజారు ప్రారంభించనున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఈ బజారులో స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను విక్రయిస్తారు. చేనేత వస్త్రాలు, హస్తకళలు, చేతి వంటల ఆహార పదార్థాలు తదితర ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయి. చేనేత, హస్తకళలను ప్రోత్సహించాల'ని కలెక్టర్ సూచించారు.

ముగ్గులు పూచే.. ముచ్చటగొలిపే!

- ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముగ్గుల పోటీలు
- సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టిన వైనం
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు, యువతులు
- పరిశీలించిన శ్రీకాకుళం ఎమ్మెల్యే దంపతులు


పేర్లు నమోదు చేసుకుంటున్న యువతులు, మహిళలు



స్పాన్సర్ల లోగోలను వేస్తున్న విద్యార్థినులు


పోటీలో పాల్గొన్న మహిళలు, విద్యార్థినులు

శ్రీకాకుళం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ ముందే వచ్చినట్టుగా... హరివిల్లు నేలపై విరిసినట్టుగా అక్కడ ముగ్గులు పూశాయి. మహిళల ప్రతిభకు అద్దం పట్టాయి. 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్ట నర్ డిగిసెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్ వేర్)' ముగ్గుల పోటీలు శ్రీకాకుళం ఏడు రోడ్ల జంక్షన్ లోని ఎన్టీఆర్ ఎంసీహెచ్ స్కూల్ మైదానంలో శనివా రం ఉదయం పది గంటలకు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు మీనాక్షి హాస్పిటల్ అధినేత, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, లేపరోస్కోపిక్ సర్జన్ డా.గొండు గంగాధర్, గైనకాలజిస్ట్, లేపరోస్కోపిక్ సర్జన్ డా.సీహె చ్ హరితలు స్థానిక స్పాన్సర్లుగా వ్యవహరించారు. సంక్రాంతి పండుగ విశిష్టతను తెలిపేలా... ప్రజలకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించేలా ముగ్గు లను తీర్చిదిద్దారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 109 మంది మహిళలు, విద్యార్థినులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంక ర్ మాట్లాడుతూ మన సంస్కృతీ సంప్రదాయాలను 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' కాపాడుతోందన్నారు. పండుగ విశిష్టతతో పాటుగా సంస్కృతిపై మహిళలకు ఉన్న గౌరవాన్ని ప్రోత్స హించేలా పోటీలు ఉంటున్నాయని అన్నారు. ఇటువంటి పోటీలకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. మీనాక్షి హాస్పి టల్ అధినేత, స్థానిక స్పాన్సర్ డాక్టర్ గొండు గంగాధర్ మాట్లాడుతూ ఇటువంటి పోటీలను పండుగ సమయంలో నిర్వహించడం వల్ల యు వతులు, మహిళల్లోనూ ఉత్సాహం కనిపిస్తోంద న్నారు. గత ఏడాది, ఈసారి కూడా స్పాన్సర్లుగా వ్యవ హరించడం ఆనందంగా ఉందన్నారు. ఎంతోమంది మహిళలు సందేశం ఇస్తూ ముగ్గులను వేశారని... వా రిలో చైతన్యం కూడా అలానే ఉందని సంతోషం వ్య క్తం చేశారు. కాలం ఎంత మారుతున్నా... సంప్రదా యాలను పాటిస్తుండాలన్నదే ఈ కార్యక్రమం ఉద్దేశ మని తెలిపారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా కిల్లం శెట్టి ధనలక్ష్మి, మణిశర్మ, అంబటి లక్ష్మీ రాజ్యం వ్యవహరించారు. ఆంధ్రజ్యోతి స్టాఫర్ టి.సురేష్‌బాబు, ఏబీఎన్ స్టాఫ ర్ రమేష్, ఏడీవీటీ మేనేజర్ కె.ఉమ, రిపోర్టర్లు ఆర్.బాలకృష్ణ, ఎల్.వెంకటర మణ, బాలాజీ, అనంతరామన్, ఏబీ ఎన్ కెమెరామెన్ రమేష్ పాల్గొన్నారు.


స్పాన్సర్లు డాక్టర్ హరిత, డాక్టర్ గంగాధర్‌కు స్వాగతం పలుకుతూ..


ఎమ్మెల్యే శంకర్‌తో 'ఆంధ్రజ్యోతి' సిబ్బంది, తదితరులు

విజేతలు వీరే...

'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముగ్గుల పోటీలో పలాసకు చెందిన పత్తి జ్యోతి ప్రథమ స్థానం సాధించారు. ఆమెకు రూ. 6వేల నగ దు బహుమతిని అందజేశారు. శ్రీకాకుళం నగరానికి చెందిన ఆశ ప్రవీణ్ ద్వితీయ బహుమతి గెలుచుకు న్నారు. ఆమె రూ.4వేల నగదును అందుకున్నారు. తృతీయ బహుమతిని పలాసకు చెందిన నౌగాపు భవాని గెలుచుకున్నారు. ఆమె రూ.3వేల నగదును అందుకున్నారు. ముగ్గురు విజేతలకు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, తెలుగు మహిళ అధ్యక్షురాలు స్వాతీశంకర్, స్పాన్సర్లు డా.గొండు గంగాధర్, డా.సీహెచ్ హరిత, ఆంధ్ర జ్యోతి-ఏబీఎన్ శ్రీకాకుళం యూనిట్ మేనేజర్ ఆర్.సోమ శంకరరావు బహుమతులను అందజేశారు. కన్సోలేషన్ బహుమతులను కోనేటి సంతోషి, కూర్మాపు ఆదిలక్ష్మి, కురుమోజు అమ్మాజీ, చిట్టూరి దేవి, వీకే జ్యోతి, మండా విజయలక్ష్మి, పి.రాజశ్రీ, బరాటం మాధురి, బత్తుల దాక్షాయణి, పి.ధనలక్ష్మిలకు అందజేశారు.


బహుమతులు అందుకుంటున్న ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలు జ్యోతి, ఆశ ప్రవీణ్, భవాని


ముగ్గులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్, స్పాన్సర్లు తదితరులు

● పలాస నుంచి వచ్చాను..

మాది పలాస. ఏటా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. ముగ్గులపై ఉన్న మక్కువతో ఈ దఫా జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో జరిగిన పోటీలకు హాజరయ్యాను. ఇటు సందేశంతో పాటు సంక్రాంతి పండుగ విశిష్టతను తెలిపాను. చుక్కల ముగ్గులపై నాకు చిన్నప్పటి నుంచి ఉన్న ఇష్టంతో ఇప్పటికీ ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నా. ప్రథమ విజేతగా నిలవడం చాలా సంతోషంగా ఉంది.

-పత్తి జ్యోతి, ప్రథమ విజేత, పలాస

● అందరిలో ఆసక్తి పెంచాలని...

మాది శ్రీకాకుళం నగరం. దాదాపు ఐదేళ్ల నుంచి పోటీల్లో పాల్గొంటున్నా. రెండు దఫాలు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి గెలుచుకున్నా. ముగ్గుల పట్ల ఆసక్తిని మాతోపాటు మరికొందరికీ పెంచాలన్న తలంపు తో ఈ పోటీల్లో పాల్గొంటున్నా. ఈ దఫా ద్వితీయ బహుమతి సాధించాను. నా తోటి విజేతలకు అభినందనలు.

-ఆశ ప్రవీణ్, ద్వితీయ విజేత, శ్రీకాకుళం

● వేకువజామునే బయలుదేరా..

మాది పలాస. అక్కడి నుంచి వేకువజామునే బయలుదేరి పోటీలకు శ్రీకాకుళం వచ్చాం. మంచి ముగ్గు వేసి బహుమతి సాధించాలనే లక్ష్యంతో ఉన్నా. ఈ దఫా పోటీ తీవ్రమైంది. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నిర్వహించే ఈ కార్యక్రమానికి అటు మహిళలు, ఇటు విద్యార్థినులు సైతం పోటీగా వచ్చారు. మొత్తానికి తృతీయ బహుమతి గెలుచుకున్నాను. మరో పదిమంది కన్సోలేషన్ బహుమతులు సాధించుకున్నారు. అందరికీ శుభాకాంక్షలు.

-నౌగాపు భవాని, తృతీయ విజేత, పలాస

17 మందితో నెట్టుకొస్తున్నాం..

- పలాస కిడ్నీ ఆసుపత్రిపై కలెక్టర్ సమీక్ష
- రేడియాలజిస్ట్, కార్డియాలజిస్టులు లేరు
- సమస్యలు వివరించిన సూపరింటెండెంట్


వైద్యాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): 'పలాసలోని 200 పడకల కిడ్నీ ఆసుపత్రి, పరిశోధన కేంద్రంలో 61 మంది వైద్యాధికారులు ఉండాలి. కానీ, కేవలం 17 మంది మాత్రమే ఇక్కడ పని చేస్తున్నారు. వారితోనే సేవలను నెట్టుకొస్తున్నాం.'అని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.పద్మజ.. కలెక్టర్‌కు వివరించారు. శనివారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వైద్యారోగ్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కిడ్నీ ఆసుపత్రికి సంబంధించి ఇంకా ఏమి కావాలని కలెక్టర్.. సూపరింటెండెంట్‌ను అడిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'ఆసుపత్రిలో సొంతంగా ఇప్పటి వరకూ డయాలసిస్ యూనిట్లే లేవు. వివిధ ఆసుపత్రుల నుంచి తీసుకువచ్చాం. వాటిని నెఫ్రోప్లస్ సిబ్బంది నిర్వహిస్తున్నారు. కొత్తగా మరో ఐదు డయాలసిస్ యూనిట్లు ఇస్తే ఇక్కడవరకూ సరిపోతుంది. ఇప్పటి వరకూ ప్రభుత్వం 61 మంది వైద్యాధికారులను నియమించాల్సి ఉండగా కేవలం 17 మంది మాత్రమే వచ్చారు. రేడియాలజిస్ట్, కార్డియాలజిస్టులు లేరు. కిడ్నీ రోగులకు పై రెండు విభాగాల వైద్యాధికారులు అత్యవసరం. బ్లడ్‌బ్యాంక్ తో పాటు ఆసుపత్రికి రక్షణ గోడ నిర్మించాలి. ఆరోగ్యశ్రీ పథకం కింద ఆపరేషన్లు చేసినా ఇంకా వాటి నగదు తమ ఖాతాలో జమకాలేదు.' అని వివరించారు. రూ.35 లక్షల విలువైన ఐదు యూనిట్లు తాను ఇస్తానని కలెక్టర్ ప్రకటించారు. వైద్యాధికారుల పోస్టులను భర్తీ చేస్తామని, కనీసం ఏడుగురు వైద్యాధికారులను నియమించడానికి వైద్యారోగ్యశాఖ అధికారులతో మాట్లాడతామని అన్నారు. ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ.. ఆదరబాదరగా ఆసుపత్రిని ప్రారంభించి సక్రమ పద్ధతిలో పరికరాలు ఇవ్వలేదన్నారు. పూర్తిస్థాయి వైద్యాధికారులను నియమించకపోవడంపై ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కిడ్నీ వ్యాధులు ప్రబలకుండా గట్టి చర్యలు తీసుకోవాలని, సిబ్బంది నియామకంతో పాటు ఆసుపత్రికి కావాల్సిన పరికరాలు సమకూర్చాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం రక్షిత మంచినీటి పథకంపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే కిడ్నీ ప్రభావిత గ్రామాల్లో శుద్ధజలాలు ఇస్తున్నామని, దీనివల్ల ఫలితాలు ఏవైనా కనిపిస్తున్నాయా? అని ప్రశ్నించారు. అంతకు ముందు ఆయన మున్సిపల్ తాగునీటి ప్రాజెక్టు కోసం ఉద్దానం రక్షిత మంచి నీటి పథకం, ఆర్డీవో కార్యాలయం కోసం కాశీబుగ్గ ఆర్ అండ్ బీ బంగ్లా, కేంద్రీయ విద్యాలయం కోసం సూదికొండ భూములు పరిశీలించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు ఉన్నారు.

వ్యసనాలకు బానిసై.. దొంగగా మారి..

- రైలులో ప్రయాణించే ఒంటరి మహిళలే టార్గెట్
- బంగారు ఆభరణాల చోరీ
- రైల్వే పోలీసులకు చిక్కిన డిగ్రీ విద్యార్థి


చోరీ సొత్తు, నిందితుడితో పలాస రైల్వే పోలీసులు..

పలాస, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆ విద్యార్థి డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు. చెడు వ్యసనాలకు బానిసై దొంగగా మారాడు. కళాశాలకు కాకుండా రైల్వేస్టేషన్లకు వెళ్లి ఒంటరి మహిళా ప్రయాణికుల మెడలోని బంగారు ఆభరణాలను చోరీ చేసి పరారవుతున్నాడు. ఈ చోరీలపై రైల్వే పోలీసులు నిఘా పెట్టడంతో ఆ విద్యార్థి చిక్కాడు. ఆయన నుంచి 103 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను పలాసలో రైల్వే సీఐ ఎ.రవికుమార్ శనివారం విలేకరులకు వెల్లడించారు. కోటబొమ్మాళి మండలం చిన్నహరిశ్చంద్రపురం గ్రామానికి చెందిన ఈరగట్టపు రాము నరసన్నపేటలోని ఓ డిగ్రీ కళాశాలలో బీకాం చివరి సంవత్సరం చదువుతున్నాడు. చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాన్ని వృత్తిగా ఎంచుకున్నాడు. ఈ క్రమంలో గతేడాది నవంబరు 12న విశాఖపట్నం జిల్లా కొత్తపాలెం గ్రామానికి చెందిన పంచారి లక్ష్మి అనే మహిళ టెక్కలి నుంచి రైలులో వస్తుండగా కోటబొమ్మాళి రైల్వేస్టేషన్ వద్ద కొంతసేపు ఆగింది. వెనుకనుంచి ఆ విద్యార్థి వచ్చి ఆమె మెడలో ఉన్న 35 గ్రాముల బంగారు ఆభరణాలు తస్కరించి పరారయ్యాడు. గత నెల 13న పాతపట్నం మండలం కాగువాడ గ్రామానికి చెందిన జలుమూరు లక్ష్మి అనే మహిళ హైదరాబాద్ వెళ్లడానికి తిలారు రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. ప్లాట్‌ఫాంపై రైలు కోసం ఆమె వేచిచూస్తుండగా వెనుక నుంచి విద్యార్థి వచ్చి ఆ మహిళ మెడలోని 35 గ్రాముల బంగారు ఆభరణాలు తస్కరించి ఉడాయించాడు. గత నెల 29న తిలారు రైల్వే స్టేషన్ వద్ద ఉన్న సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం గ్రామానికి చెందిన సనపల భారతి మెడలోని 33 గ్రాముల బంగారు పుస్తెలతాడును తెంచుకుని మెరుపు వేగంతో పరారయ్యాడు. ఈ మూడు ఘటనలపై పలాస రైల్వే పోలీసులకు ఫిర్యాదులు అందాయి. రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఆదేశాల మేరకు రైల్వే పోలీసులు పలాస నుంచి ఆమదాలవలస వరకూ ఉన్న రైల్వే స్టేషన్లతో పాటు రైళ్లలో కూడా నిఘా పెట్టారు. ఈ క్రమంలో శనివారం ఉదయం తిలారు రైల్వేస్టేషన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న డిగ్రీ విద్యార్థిని పట్టుకున్నారు. ఆయన్ను విచారించగా దొంగతనాల విషయం బయట పడింది. బంగారు ఆభరణాలు దొంగిలించి రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఉన్న సరుగుడు తోటల్లో తలదాచుకుంటాడని, ఎవరూ లేని సమయంలో బయటకు వచ్చి మళ్లీ కళాశాలకు వెళ్లిపోవడం నిత్యకృత్యంగా పెట్టుకున్నాడని సీఐ తెలిపారు. ఆభరణాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని విశాఖ రైల్వే కోర్టులో హాజరుపరిచామన్నారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న ఎస్‌ఐ షేక్ షరీఫ్, కానిస్టేబుళ్లు తులసి, సంతోష్‌కుమార్, బి.దేవేంద్రనాథ్, శ్రీనివాసరావును సీఐ అభినందించారు.

తంగివానిపేట.. ఆధ్యాత్మిక కోట

- ప్రజల్లో భక్తిభావం పెంచుతున్న గ్రామస్తులు
- మూడున్నర దశాబ్దాలుగా మేలుకొలుపు
- కోలాటానికి జిల్లాలో గుర్తింపు


మేలుకొలుపు బృందం

ఎచ్చెర్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆ గ్రామం చాలా చిన్నది.. ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లడంలో మాత్రం ఎంతో పెద్దది. ఎన్నికల సమయంలో తప్ప మిగిలిన సమయంలో చాలా వరకు ఆధ్యాత్మిక సేవకే ఆ గ్రామస్థులు అధిక సమయాన్ని వెచ్చిస్తారు. ఓ వైపు కోలాటంతో ఇక్కడి మహిళలు జిల్లాలోనే గుర్తింపు పొందితే.. ఇంకోవైపు మేలుకొలుపుతో ఇక్కడి భజన బృందం జనాన్ని భక్తి మార్గం వైపు నడిపిస్తోంది. జాతీయ రహదారికి సుమారు 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామం పరిసర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోందనడంలో సందేహం లేదు. అదే ఎచ్చెర్ల మండలం జరజాం పంచాయతీ తంగివానిపేట గ్రామం. ఈ గ్రామంలో గత 35 ఏళ్లుగా మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ గ్రామానికి చెందిన శ్రీరామ భజన బృందం ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తోంది. ధనుర్మాసం ప్రారంభమైన రోజు నుంచి భోగి పండగ వరకు నెల రోజుల పాటు మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 15 మంది సభ్యులు బృందంగా ఏర్పడి మేలుకొలుపు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ తెల్లవారు జామున 4 గంటల నుంచే భజన బృందమంతా గ్రామాల్లో నగర సంకీర్తన చేస్తున్నారు. జరజాం, భగీరథపురం, అజ్జరాం, ఎస్ఎస్ఆర్‌పురం, కొయ్యాం, బడివానిపేట, కుప్పిలి తదితర గ్రామాల్లో మేలుకొలుపు నిర్వహిస్తున్నారు. రోజుకో గ్రామం చొప్పున దాదాపుగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అలాగే లావేరు మండలంలో బయ్యన్నపేట, గుంటుకుపేట, పెదరావుపల్లి, ఆరంగిపేట, నక్కపేట తదితర గ్రామాల్లో కూడా ఇదే బృంద సభ్యులు మేలుకొలుపు నిర్వహిస్తున్నారు. బట్న గోపాల్, జరుగుళ్ల అప్పడు, బట్న సంతోష్ కుమార్, రెడ్డి రమణ, బట్న శ్రీనివాసరావు, బట్న మల్లేశ్వరరావు, తంగి చిరంజీవి, గౌరీ శంకర్, రమణమూర్తి, నక్కిర్ల జానకిరామ్, పొన్నాన లోకేశ్వరరావు, లక్ష్మణరావు తదితర భజన బృందం మేలుకొలుపు కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటున్నారు.

35 ఏళ్లుగా నిర్వహిస్తున్నాం..



గత 35 ఏళ్లుగా మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ధనుర్మాసం నుంచి భోగి పండగ వరకు ఈ కార్యక్రమాన్ని గ్రామాల్లో నిర్వహించి భక్తి భావాన్ని చాటుతున్నాం. ప్రజల్లో ఆధ్యాత్మిక భావం పెంపొందించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం.

-తంగి మల్లేశ్వరరావు, మాజీ సర్పంచ్, జరజాం

భగవంతుని తలచుకుంటే మంచిదని..



తెల్లారి లేచింది మొదలు భగవంతుని స్మరణతో కార్యక్రమం ప్రారంభిస్తే ఆ రోజంతా సంతోషంగా ఉంటుంది. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత ఉంటుంది. ప్రజలను ఆధ్యాత్మికం వైపు మళ్లించేందుకు ఈ కార్యక్రమం దోహద పడుతుంది. ఈ కార్యక్రమానికి ప్రజల్లో మంచి ఆదరణ ఉంది.

-బట్న గోపాల్, నిర్వాహకుడు, తంగివానిపేట

అరచేతిలో 2025 క్యాలెండర్

సోంపేట/పలాస రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): క్యాలెండర్ అంటే 12 నెలలకు 12 పేజీలు ఉంటాయి. వాటిలో వారాలు, రోజులు తదితర వివరాలు ఉంటాయి. అలాంటిది ఒకే పేజీలో సంవత్సరం మొత్తం క్యాలెండర్ ఉంటే... తేదీ, వారాలను తెలుసుకునే అవకాశం ఉంటే... అలాంటి అవకాశం కల్పిస్తున్నారు కంచిలి మండలం బూరగాం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు, గణిత అవధాని మద్దు తిరుపతిరావు.



2025 క్యాలెండర్

- ఉదాహరణకు 2025 జనవరి నెలలో 26వ తేదీ ఏ వారం వస్తుందో తెలుసుకుందాం. మనకు కావలసిన జనవరి నెలలో దిగువగా పక్కనే ఉన్న బాక్స్‌లో 26తేదీకి అడ్డంగా ఎడమ వైపు చూస్తే (అడ్డంగా, నిలువుగా రెండూ ఖండించిన దగ్గర) వారం తెలుస్తుంది. ఈ విధంగా 26.01.2025 ఆదివారంగా గుర్తించవచ్చు.
- 14.01.2025 ఏ వారం వస్తుందో తెలుసుకోవాలంటే...
- పక్కన ఉన్న వృత్త పటంలో నెలలు, వాటి కోడ్‌లు ఉంటాయి. దీనిలో జనవరి నెల కోడ్‌ను చూడాలి. అందులో జనవరి నెల 3 ఉంది.
- కోడ్ 3ను తేదీ 14కు కలపాలి. అప్పుడు 17 వస్తుంది.
- ఈ 17ను వారంలోని రోజులకు సంబంధించి 7తో భాగించాలి. అప్పుడు శేషం 3 వస్తుంది.
- శేషం 3ను పక్కన ఉన్న పట్టికలో చూడాలి. అదే 14.01.2025 కు సంబంధించిన వారం అవుతుంది. ఈ లెక్కన పట్టికలో మంగళవారం అవుతుంది. ఇదే విధంగా సంవత్సరంలోని ఇతర నెలల్లో ఏ తేదీ ఏ వారం వస్తుందో తెలుసుకోవచ్చు.

సృజనాత్మకతకు పదును..

గణితం కేవలం పాఠ్యాంశమే కాదు... సృజనాత్మకమైన జ్ఞానాన్ని అందిస్తుందని గణిత అవధాని, ఉపాధ్యాయుడు మద్దు తిరుపతిరావు అన్నారు. ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ 2025 సంవత్సరం క్యాలెండర్‌ను పోస్టుకార్డుపై రెండు విధాలుగా గణిత విధానం ద్వారా తయారు చేసినట్లు తెలిపారు. పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు, ఇతర సామర్థ్య పరీక్షలకు ఇది ఎంతో ఉపయోగ పడుతుందని ఆయన తెలిపారు.

వైసీపీ అనాలోచిత నిర్ణయాలతో రైతులకు నష్టం

● కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు


రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్

సోంపేట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు వల్లే భూ రీసర్వేతో రైతులు ఇబ్బంది పడ్డారని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. పలాసపురం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. నాటి రీసర్వే తప్పులను సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందన్నారు. నెలరోజుల్లో సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వ చేసిన అప్పులు రాష్ట్రాభివృద్ధికి అడ్డంకిగా మారిందన్నారు. పలాసపురం, లక్కవరంలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తామన్నారు. నరసన్నపేట నుంచి ఇచ్ఛాపురం వరకు ఆరులైన్ల రహదారి కోసం మంత్రి గడ్కారీతో మాట్లాడానని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, మాజీ మంత్రి గౌతు శివాజీని గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. సోంపేట మెయిన్ రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేయాలని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడును స్థానిక నాయకులు వినతి పత్రం అందించారు. వినతి పత్రం అందించినవారిలో టీడీపీ నాయకులు చిత్రాడ శ్రీనివాసరావు, సూరాడ చంద్రమోహన్, మద్దిల నాగేశ్వరరావు, బీజేపీ నాయకుడు బీన వంశీ తదితరులు ఉన్నారు.

రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి: కలెక్టర్

కుటుంబ సభ్యుల భూ లావాదేవీల విషయంలో చేసుకున్న పారీకర్తులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటేనే చెల్లుతుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. పలాసపురం గ్రామంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. డీ-పట్టా భూముల క్రయవిక్రయాలు చెల్లుబాటుకాదన్నారు. జిల్లాలో 1466 రెవెన్యూ గ్రామాల్లో గత నెల 5న నుంచి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో 12,000 అర్జీలు వచ్చాయని, వీటిని నెల రోజుల్లో పరిష్కరించేందుకు కృషిచేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. జేసీ ఫర్మాన్ అహ్మద్, పలాస ఆర్డీవో వెంకేష్, సీఐలు మంగరాజు, చిన్నంనాయుడు, నాయకులు జీకే నాయుడు, చిత్రాడ శ్రీనివాసరావు, సూరాడ చంద్రమోహన్ తదితరులు ఉన్నారు.

అద్దె బకాయిలపై కదిలిన యంత్రాంగం

● బకాయి చెల్లించని రెండు దుకాణాలు సీజ్


దుకాణానికి సీల్ వేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థకు చెందిన దుకాణాల అద్దె బకాయిలు చెల్లించని వారిపై ఎట్టకేలకు కార్పొరేషన్ కార్యాలయ సిబ్బంది చర్యలు చేపట్టారు. ఈ నెల 4న 'అద్దె వదిలేశారు' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి కార్పొరేషన్ అధికారులు స్పందించారు. కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా ఉన్న పెద్ద మార్కెట్‌లో షాప్ నెంబరు-3లో వ్యాపారం నిర్వహిస్తున్న ఎస్.రామరాజ్యం రూ.3,25,000, షాప్ నెంబరు-57లో వ్యాపారం చేస్తున్న గోవిందరాజులు రూ.3,90,000 అద్దె బకాయిలు ఉన్నారు. దీంతో కమిషనర్ పీవీవీ ప్రసాదరావు ఆదేశాల మేరకు.. ఈ రెండు దుకాణాలను సీజ్ చేసేందుకు ఆదేశించారు. దీంతో ఆర్ఐ నరేష్‌బాబు సిబ్బందితో శనివారం ఆ రెండు దుకాణాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రసాదరావు మాట్లాడుతూ.. నగర పాలక సంస్థ పరిధిలో అద్దె బకాయిలు చెల్లించని దుకాణాలను గుర్తించి సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీ

రణస్థలం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రణస్థలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆ శాఖ డీఐజీ ఎ.నాగలక్ష్మి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల 'రెవెన్యూలో ఫోర్జరీ' అన్న శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఉన్నత అధికారులు స్పందించారు. దీంతో డీఐజీ నాగలక్ష్మి దర్యాప్తు చేశారు. ప్రధానంగా గ్రామ కంఠం భూములకు సంబంధించి తప్పుడు సర్వే నెంబర్లతో రిజిస్ట్రేషన్ చేయడంపై రికార్డులు పరిశీలించినట్టు తెలిసింది. అదేవిధంగా రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వచ్చిన పలువురితో మాట్లాడి, వివిధ అంశాలపై ఆరా తీశారు. ప్రైవేట్ వ్యక్తులను కార్యాలయంలోని అనుమతించకుండా దర్యాప్తు చేశారు. గ్రామకంఠం భూమి రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు సంబంధిత రెవెన్యూ అధికారితో మాట్లాడాలని సూచించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకూ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు.

ఆదిత్యునికి రూ.లక్ష విరాళం

అరసవల్లి, జనవరి 4(ఆంధ్ర జ్యోతి): ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారికి శ్రీకాకుళానికి చెందిన కప్పగం తుల సూర్యనారాయణమూర్తి, వెంకటలక్ష్మి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి శాశ్వత అన్నదాన పథకానికి రూ.లక్ష చెక్కును ఆలయ ఈవో వై.భద్రాజీకి అందజేశారు. వారికి ఆలయ అర్చకులు ఇప్పిలి మాధవశర్మ ఆశీర్వదించగా, ఈవో జ్ఞాపికను అందించారు.

డోనర్ పాస్‌లకు రిజిస్ట్రేషన్ చేయించుకోండి

అరసవల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రథసప్తమి సందర్భంగా స్వామివారి దర్శనానికి పాసులు తీసుకోవాలనుకు దాతలు (గతంలో రూ.లక్ష పైబడి విరాళం ఇచ్చినవారు) ఈ నెల 10వ తేదీలోగా వారు ఇచ్చిన విరాళాల రశీదు వివరాలు, ఆధార్ కార్డు జెరాక్స్ ఇచ్చి, కార్యాలయం వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఈవో వై.భద్రాజీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారికి మాత్రమే డోనర్ పాసులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు

జలుమూరు (సారవకోట), జనవరి 4(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాల్లో గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం మహిళా పోలీసులు సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో పేకాట, పిక్కలాట, అశ్లీల నాటకాలు జరుగకుండా చూసే బాధ్యత సచివాలయాల మహిళా పోలీసులపైనే ఉందన్నారు. మద్యం అమ్మకాలు, గంజాయి, మాదక ద్రవ్యాల విక్రయం జరిగితే తక్షణం సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరించినట్లయితే వారి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో ఎస్ఐ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం రైతుకు పురస్కారం

ఆమదాలవలస, జనవరి 4(ఆంధ్రజ్యోతి): నిమ్మతొర్లాడ గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ అభ్యుదయ రైతు నక్క చిరంజీవికి రైతు నేస్తం పురస్కారం వరించింది. శనివారం గుంటూరులో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఈ అవార్డును వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేతుల మీదుగా అందుకున్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు పరిష్కారం


సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే రవికుమార్

బూర్జ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులతో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చునని ఎమ్మెల్యే కూన రవి కుమార్ అన్నారు. శనివారం తోటవాడ పంచాయతీలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణంనాయుడు, తహశీల్దార్ పద్మావతి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న విభిన్న ప్రతిభావంతులు


బ్రెయిలీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

అరసవల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్ అన్నారు. డీఆర్డీఏ కాంపెక్స్‌లో శనివారం నిర్వహించిన లూయీ బ్రెయిలీ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విభిన్న ప్రతిభావంతులు ఉన్నత ఉద్యోగాలు పొందగలిగారంటే అందుకు లూయిస్ బ్రెయిలీ కారణమన్నారు. తొలుత బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏడీ కవిత, డీఐపీఆర్‌వో కె.చెన్నకేశవరావు, సెట్విన్ సీఈవో ప్రసాదరావు, విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.

● ఇచ్ఛాపురం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రపంచ బ్రెయిలీ జయంతి ముత్యాలమ్మపేట భవిత కేంద్రంలో శనివారం ఘనంగా జరిపారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ఎస్.విశ్వనాథం, ఉపాధ్యాయులు ఉదయ్‌బాస్కర్, నాగమణి, ఎంఆర్‌సీ సిబ్బంది కామేష్, రవి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యం

అరసవల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఆర్టీసీ డిపోలో ఆయన శనివారం రెండు అల్ట్రా డీలక్స్ కొత్త బస్సులను ప్రారంభించి మాట్లాడారు. త్వరలోనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నామన్నారు. టీడీపీ నాయకులు రెడ్డి గిరిజా శంకర్, అంధవరపు ప్రసాద్, డిపో మేనేజర్ కేఆర్ఎస్ శర్మ, ఏఎన్ఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు


పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఎచ్చెర్ల, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుల్స్ నియామక ప్రక్రియలో భాగంగా ఎచ్చెర్లలోని సాయుధ పోలీసు మైదానంలో అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. ఐదో రోజైన శనివారం 588 మంది మహిళలు హాజరుకావల్సి ఉండగా, 330 మంది హాజరయ్యారు. ఇందులో 129 మంది అర్హత సాధించారు. ఈ నెల 6వ తేదీ నుంచి యథావిధిగా ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఈ ఎంపికలను పర్యవేక్షిస్తున్నారు.

స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

అరసవిల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట మండలం తామరాపల్లి వద్ద గల బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల(బాలికలు)లో ఖాళీగా ఉన్న హెల్త్ సూపర్‌వైజర్/స్టాఫ్‌నర్సు పోస్టు భర్తీ చేసేందుకు ఇంటర్వ్యూలకు ఆహ్వానిస్తున్నారు. బీఎస్సీ నర్సింగ్/జీఎన్ఎం పూర్తి చేసినవారు అర్హులని, వారి బయోడేటాతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా జిల్లా కేంద్రంలోని ఆదివారంపేట వద్ద గల జిల్లా సమన్వయాధికారిని ఈ నెల 6వ తేదీ మధ్యాహ్నం 2.00 గంటల నుంచి నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సమన్వయకర్త ఎస్.బాలాజీ నాయక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 08942-279923, 9701736862 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆకట్టుకున్న విభావరి

సోంపేట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): త్యాగరాజుస్వామి 176వ ఆరాధనోత్సవాల్లో భాగంగా స్థానిక సంస్కారభారతి విద్యాసంస్థలో శనివారం నిర్వహించిన సంగీత విభావరి ఆకట్టుకుంది. యల్లా వెంకటేశ్వరరావు వారి బృందం గీతాలాపన చేశారు. కార్యక్రమానికి కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ నిమ్మన దాసు పాల్గొన్నారు.

విద్యుత్ టారిఫ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

అరసవల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షిక ఆదాయ అవసరాలు, చార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ నాగిరెడ్డి కృష్ణమూర్తి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి 7, 8, 10 తేదీల్లో హైబ్రిడ్ విధానంలో శ్రీకాకుళం, టెక్కలి, పలాస డివిజన్ కార్యాలయాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. 7, 8 తేదీల్లో 'ఏ కన్వెన్షన్ సెంటర్, బృందావన కాలనీ, విజయవాడ, 10న 'కాన్ఫరెన్స్ హాల్, కమిషన్ ఆఫీసు, కర్నూలు'లో నిర్వహిస్తారన్నారు. ప్రతీరోజూ సూచనలు, సలహాలు ఇచ్చేందుకు వినియోగదారులెవరైనా పాల్గొనవచ్చని తెలిపారు. ఇందుకు ముందుగా ఏదైనా విద్యుత్తు డివిజనల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

చంద్రబాబు దంపతులను కలిసిన ఎమ్మెల్యే గొండు


చంద్రబాబు, భువనేశ్వరితో ఎమ్మెల్యే శంకర్ దంపతులు

అరసవల్లి, జనవరి 4(ఆంధ్ర జ్యోతి): విశాఖపట్నం విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన సతీమణి నారా భువనేశ్వరిని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, ఆయన సతీమణి స్వాతి శనివారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

పొందూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల కుటుంబాలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. గోరింటలో మండల పార్టీ సోషల్‌మీడియా ఇన్‌చార్జి వరదరాజులను, మండల కేంద్రంలో ఇటీవల మృతిచెందిన మాజీ వైస్ ఎంపీపీ, ప్రస్తుత వైస్ ఎంపీపీ చల్లమాంబ భర్త రాజారావు కుటుంబాన్ని పరామర్శించారు. కూటమి నాయకులు తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

అరసవల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు నగరంలోని 80 అడుగుల రోడ్డులో గల తన నివాసంలో శనివారం గుండ మోహన్‌కు రూ.3.30లక్షలు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంపై డీఈవో ఆరా

టెక్కలి/పలాస/నందిగాం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పలు ఉన్నత పాఠశాలలను డీఈవో తిరుమల చైతన్య శనివారం తనిఖీ చేశారు. చాకిపల్లి, నందిగాం ఉన్నత పాఠశాలలు, పలాస జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించి 100 రోజుల ప్రణాళికప అమలుపై ఆరా తీశారు. అలాగే కళాశాల విద్యార్థులకు ప్రారంభించిన డొక్కా సీతమ్మ మధ్యాహ్నభోజనంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో డిప్యూటీ డీఈవో విలియమ్స్, హెచ్ఎం వై.హరిబాబు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సర్వేకు సహకరిస్తే రైతులకు న్యాయం

బూర్జ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులకు రైతులు అన్ని విధాలా సహకరిస్తే న్యాయం జరుగుతుందని ఆర్డీవో సాయి ప్రత్యూష అన్నారు. ఏపీ పేట పంచాయతీ గోపిదేవిపేట గ్రామాన్ని ఆమె శనివారం సందర్శించారు. ఆ గ్రామంలో నిర్వహిస్తున్న భూముల రీ సర్వేను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాదరావు, కొరికాన వెంకటశివసాయి, సీతారామరాజు, సర్వేయర్ జి.రాజశేఖర్, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చిన్నారుల సంక్రాంతి సంబరాలు


సంప్రదాయ వేషధారణలో చిన్నారులు

అరసవల్లి, జనవరి 4(ఆంధ్ర జ్యోతి): నగరంలోని దండివీధి అంగన్‌వాడీ కేంద్రంలో సంక్రాంతి సంబరాలు శనివారం నిర్వహించారు. ప్రీ స్కూల్ పిల్లలచే ఆటలు, పాటలతో సందడి చేశారు. పిల్లలకు వివిధ రకరకాల సంప్రదాయ వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, సీడీపీవో శోభారాణి, నోడల్ అధికారి మణెమ్మ, సూపర్‌వైజర్ కల్యాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అలరించిన సంగీతం

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో 303వ నెల సాంస్కృతిక కార్యక్రమం బాపూజీ కళామందిర్‌లో నిర్వహించారు. రాజరాజేశ్వరి దేవిపీఠం వ్యవస్థాపకులు నుసరాపు లక్ష్మీగణపతి శర్మ శిష్య బృందంచే శాస్త్రీయ భక్తి సంగీత విభావరి నిర్వహించారు. అన్నమయ్య కీర్తనలు, శ్రీరామ నామ, వెంకటేశ్వర స్వామి నామకీర్తనలు నిర్వహించారు.

ఓవరాల్ చాంపియన్.. డొంకూరు

ఇచ్ఛాపురం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కవిటి మండలంలో రెండు రోజులపాటు జరిగిన మండల స్థాయి జోనల్ లెవల్ గ్రిగ్స్ పోటీల్లో డొంకూరు జడ్పీ ఉన్నత పాఠశాల స్పోర్ట్స్ చాంపియన్ షిప్, గేమ్స్ చాంపియన్ షిప్, ఆల్ రౌండర్ చాంపియన్ షిప్ కైవసం చేసుకుంది. శనివారం పాఠశాలలో హెచ్ఎం వెంకట రమణ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేసి విజేతలకు బహుతులు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ధనుర్మాస పూజలు జిల్లాలో కొనసాగుతున్నాయి. నగరంలోని దూదివారి కోవెల వేంకటేశ్వర స్వామి ఆలయంలో, నారాయణ తిరుమలలో వెంకన్నకు పూజలు తులసి దళాలతో పూజలు చేపట్టారు. పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలతోపాటు ప్రవచనాలు చేశారు.

'సుడా'లో గ్రీవెన్స్ రేపు

శ్రీకాకుళం అర్బన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం పట్టణ అభివృద్ధి సంస్థ (సుడా) పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఇకపై గ్రీవెన్స్ నిర్వహించనున్నట్టు సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పారదర్శకమైన పాలనే ధ్యేయంగా సుడా కార్యాలయంలో ఈ నెల 6వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే 86396 66590 ఫోన్ నెంబరులో తెయజేయవచ్చునన్నారు.

ప్రయోజనం

పొందూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన 'కిశోర్ వికాసం' కార్యక్రమం బాలికలకు ఎంతో ప్రయోజనం చేకూర్చుతుందని తాడివలస పీహెచ్‌సీ వైద్యులు రమేష్ నాయుడు అన్నారు. తాడివలస జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలవల్ల కలుగుతున్న నష్టాలను వివరించారు. హెచ్ఎం బి.కంఠయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలకు 'సాహిల్'

పలాసరూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పాఠశాల క్రీడా సమాఖ్య ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు బొడ్డపాడు ఉన్నత పాఠశాల విద్యార్థి రాపాక సాహిల్ కుమార్ ఎంపికైనట్టు పీడీ రాంజీ తెలిపారు. ఇటీవల అమలాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలో పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికైన సాహిల్ కుమార్‌ను శనివారం ఎమ్మెల్యే గౌతు శిరీష అభినందించారు.

పరామర్శ

ఆమదాలవలస, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల మరణించిన పలు కుటుంబాలను శనివారం మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం పరామర్శించారు. బీఆర్ నగర్‌లోని పాత్రుని పాపారావు కుమారుడు ఇటీవల గుండె సంబంధిత వ్యాధితో మృతి చెందగా, శ్రీకాకుళంలో నివాసం ఉంటున్న రిటైర్డు ఉపాధ్యాయుడు సువ్వారి అచ్చంనాయుడు అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించారు

చిరుద్యోగుల పొట్ట కొట్టొద్దు

ఆమదాలవలస, జనవరి 4(ఆంధ్రజ్యోతి): చిరుద్యోగుల పొట్టకొట్టడం తగదని నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. పట్టణంలోని బొడ్డేపల్లిపేటలో ఉన్న జగనన్న ప్రజా సేవ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కుటుంబ పోషణ కోసం చిన్నపాటి ఉద్యోగాలు చేస్తున్న వారిని తొలగించడం అన్యాయమన్నారు. ఇటువంటి చర్యలను ఎమ్మెల్యే రవికుమార్ విరమించుకోవాలన్నారు.

లైఫ్ సర్టిఫికెట్లపై అవగాహన

టెక్కలి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రిటైర్డు ఉద్యోగులు ఖజానా శాఖకు సమర్పించే లైఫ్ సర్టిఫికెట్లపై ఆ సంఘ అధ్యక్షుడు రోణంకి రామచంద్రరావు శనివారం అవగాహన కల్పించారు. వచ్చే నెల 28 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఇళ్లల్లో కదలలేని స్థితిలో ఉన్నవారు 83412 75557 నెంబరులో సంప్రదించాలని కోరారు. ఆధార్, పీపీవో, బ్యాంకుఖాతా నెంబరు, ఆధార్ లింక్ ఫోన్ నెంబరు సమర్పించాలని కోరారు. ఆయనతో పాటు ధర్మారావు, ఎస్‌వీ రమణ ఉన్నారు.


చలానా కట్టాల్సిన పనిలేదు

రణస్థలం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): భూమి జాయింట్‌గా ఉన్న ఎల్‌పీఎం విడదీయడానికి గతంలో రూ.550 చలానా చెల్లించేవారిని, ఇప్పుడు ఆ డబ్బులు కట్టకుండానే ఉచితంగా ఎల్‌పీఎం విడదీయడానికి ప్రభుత్వం జీవో విడుదల చేసిందని తహసీల్దార్ ఎస్.ప్రసాద్ తెలిపారు. అదేవిధంగా కొత్తగా 10 రేషన్ డిపోలకు నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందన్నారు. ఎంపీపీ పిన్నింటి రజనిసాయి అధ్యక్షతన శని వారం సర్వసభ్య సమావేశం ఎంపీడీవో సమావేశపు మందిరం లో జరిగింది. రైతులకు రాయితీపై విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో భాస్కరావు తెలిపారు. మత్స్యశాఖ అధికారులు ప్రతీ సమావేశానికి గైర్హాజరు కావడంపై సభ్యులు ధ్వజమెత్తారు. బాల్య వివాహాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని సీడీపీవో ఝాన్సీబాయ్ అన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు పిన్నింటి సాయికుమార్, జడ్పీటీసీ టొంపల సీతారాముడు, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, ఈవోపీఆర్డీ ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

పొందూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణాల దుకాణాల్లో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ వి.సత్యనారాయణ సూచించారు. పోలీస్‌స్టేషన్‌లో శనివారం బంగారం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. రాత్రిపూట నైట్ వాచ్‌మెన్ నియమించుకోవాలన్నారు.









క్రైం కార్నర్

11.43 కిలోల గంజాయి స్వాధీనం

● ఇద్దరు అరెస్టు.. ఒకరు పరార్



పట్టుబడిన గంజాయితో ఎక్సైజ్ అధికారులు

ఇచ్ఛాపురం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి బెంగళూరు తరలిస్తున్న 11.43 కిలోల గంజాయి మూటలను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్టు ప్రొబిషన్ ఎక్సైజ్ సీఐ పి.దుర్గా ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. శనివారం ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ సిబ్బంది ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో గస్తీ కాస్తుండగా.. అనుమానితులుగా కనిపించిన ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా, దిగపొడి బ్లాక్.. తుంటపాడు గ్రామానికి చెందిన లాలూ ప్రసాద్ శెట్టి, చీకటి బ్లాక్‌కు చెందిన సోనూ గౌడాను పట్టుకొని తనిఖీ చేయగా.. వారివద్ద గంజాయి మూటలు పట్టుబడ్డాయి. దీంతో వారిని అరెస్టు చేశారు. గంజాయి సరఫరా చేస్తున్న చీకటి బ్లాక్‌కు చెందిన కనహా మహర్నా పరారయ్యాడని, త్వరలో పట్టుకుంటామన్నారు. వీరు ముగ్గురు ఒడిశాలో కొనుగోలు చేసిన గంజాయిని ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌కు తరలించి, అక్కడి నుంచి ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో బెంగుళూరు తీసుకువెళ్లేందుకు సిద్ధమైనట్టు ఆయన తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు



గాయపడిన రామారావు

కోటబొమ్మాళి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): హరిశ్చంద్రపురం రైల్వే ఫ్లై ఓవర్ సమీపంలో శనివారం జరిగిన రైలు ప్రమాదంలో పాతపట్నం మండలం సీది పంచాయతీ తీమర గ్రామానికి చెందిన ఎందవ రామారావు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి.. హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో ఏజెంట్‌గా పనిచేస్తున్న రామారావు ఆదివారం వారి స్వగ్రామంలో జరిగే ఒక కార్యక్రమానికి హాజరయ్యేందుకు విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో వచ్చాడు. ఇతడు తిలారులో దిగాల్సి ఉండగా అదమరిచి స్టేషన్‌లో దిగలేదు.. ఎక్కడ దిగాలో ఆలోచిస్తున్న తరుణంలో హరిశ్చంద్రపురం రైలు నిలయం వద్ద రైల్వే పనులు సిబ్బంది చేస్తుండగా రైలు నెమ్మదిగా వెళుతున్నట్లు గుర్తించి రామారావు రైలు దిగే క్రమంలో కిందపడి పోవడంతో తీవ్ర గాయాలయ్యాయి అక్కడ పనులు చేస్తున్న సిబ్బంది 108కు సమాచారం ఇవ్వడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్లి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

బొర్రంపేటలో ఇరువర్గాల మధ్య వివాదం

ఎల్.ఎన్.పేట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): బొర్రంపేట గ్రామంలో శుక్రవారం ఇరువర్గాల నడుమ జరిగిన వివాదంలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.హైమవతి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. శుక్రవారం వీధి కాలువలో మురుగునీరు, చెత్త కుప్పలను తొలగిస్తుండగా మురుగునీరు తమ స్థలంలోకి వెళుతోందని కింతలి అఖిల్, రామారావు, భానుమతిలు కోట గున్నమ్మ, అప్పన్న, బొడ్డేపల్లి రాములతో ఘర్షణకు దిగి చేయి చేసుకున్నారు. వీధి కాల్వల్లో పనులను పూర్తి చేసేందుకు సర్పంచ్ బి.రమణమ్మ కోట గున్నమ్మ, అప్పన్న, రామారావులకు బాధ్యత అప్పగించగా వారు పనులు చేయిస్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. దీంతో దీంతో గున్నమ్మ, అప్పన్న, రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘర్షణకు దిగిన ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

వజ్రపుకొత్తూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నగరంపల్లి గ్రామానికి చెందిన దుబ్బ చంద్రయ్య (53) కుటుంబ కలహాల నేపథ్యంలో ఊరిపోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్ఐ జూన్నారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. చంద్రయ్య నిత్యం మద్యం సేవించి కుటుంబ సభ్యులతో గొడవ పడుతుండేవాడు. తన మాటకు ఎవరు ఎదురు చెప్పినా సహించేవాడు కాదు. దీంతో కుటుంబ సభ్యులు అతనితో పెద్దగా మాట్లాడేవారు కాదు. తను వేరుగా ఇంట్లో ఒక గదిలో పడుకొనేవాడు. ఈ నేప థ్యంలో శుక్రవారం రాత్రి భోజనం అయిన తరువాత అందరూ నిద్ర పోయిన సమయంలో తన గదిలో ఉన్న ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం తలుపుతీయకపోవడంతో గ్రామస్థుల సహకారంతో తలుపులు పగలగొట్టి చూడగా చంద్రయ్య ఆత్మహత్య చేసుకుని ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా ఏఎస్ఐ జూన్నారావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీ లించారు. శవ పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభు త్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. మృతునిడి భార్య శ్రీదేవి, కుమార్తె, కుమా రుడు ఉన్నారు. చంద్రయ్య జీడి ఫ్యాక్టరీలో పనిచేస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

ఢిల్లీలో అమర జవాన్‌కు భార్య నివాళి



అధికారి నుంచి స్మారక జ్ఞాపికను అందుకుంటున్న కమలమ్మ

సంతబొమ్మాళి,జనవరి4 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉంటూ ఉగ్ర వాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన జవాన్ తెలుగు ఆదినారాయణకు అతని భార్య కమలమ్మ శుక్రవారం ఢిల్లీలో నివాళులు అర్పించింది. మండలంలోని నరసాపురానికి చెందిన ఆదినారాయణ 11 అసోం రైఫిల్‌లో పనిచేస్తూ 2003 జనవరి 8న త్రిపుర రాష్ట్రం అగర్తలా సమీపంలో పెట్రోలింగ్ చేస్తుండగా ఉగ్రవాదుల దాడిలో మృతి చెందాడు. అతని సేవలకు గుర్తించి మరణానంతరం 2007లో కేంద్ర ప్రభుత్వం సేన అవార్డు ప్రకటించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద జరిగిన వార్ మెమోరియల్‌లో భాగంగా అమరవీరుడు ఆదినారాయణకు నివాళులు అర్పించేందుకు రావాలని భార్య కమలమ్మకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నుంచి ఆహ్వానం వచ్చింది. ఈ మేరకు ఢిల్లీలోని ఇండియాగేట్ సమీపంలో శుక్రవారం సాయంత్రం 5.40 గంటలకు ఆమె సైనిక లాంచనాల మధ్య భర్త ఆదినారాయణకు నివాళులు అర్పించింది. ఈ సందర్భంగా మిలటరీ అధికారులు ఆమెకు స్మారక మెమొంటో అందించారు.

భర్తకు భార్య అంత్యక్రియలు



భర్త అంత్యక్రియలు చేస్తున్న భార్య ధనలక్ష్మి

టెక్కలి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నర్సింగపల్లి పంచాయతీ కొల్లి వలస గ్రామంలో శనివారం అనారోగ్యంతో మృతి చెందిన తోట నూకరాజు(50)కు భార్య ధనలక్ష్మి తలకొరివి పెట్టింది. నూకరాజు, ధనలక్ష్మిలకు పిల్లలు లేకపోవడంతో చివరికి భార్యే భర్త దహన సంస్కారాలకు పూనుకుంది. అయితే ఇది చూసిన పలువురు కన్నీటి పర్యంతమయ్యారు.

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం ప్రారంభం

రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రకటించిన మధ్యాహ్న భోజన పథకాన్ని జిల్లాలోని కళాశాలల్లో శనివారం ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రారంభించారు.

● జూనియర్ కళాశాలల్లో శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యేలు
● ఇంటర్ విద్య బలోపేతానికి కృషి: బగ్గు

నరసన్నపేట/పోలాకి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇందులో భాగంగా మధ్యాహ్న భోజనాన్ని అమలు చేస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం నరసన్నపేట, పోలాకి జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఏడాది నుంచి ఇంటర్ విద్యార్థులకు పోటీ పరీక్షలకు అనుగుణంగా పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పి.దాలినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు శిమ్మ చంద్రశేఖర్, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, గొద్దు చిట్టిబాబు, కింజరాపు రామారావు, ఉణ్న వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో శారీరక ఎదుగుదల: శిరీష

పలాస, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదల సాధ్యమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నభోజనం పథకాన్ని ప్రారంభించారు. విద్యార్థుల ఆరోగ్యరక్షణకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. డీఈవో ఎస్.తిరు మలచైతన్య మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా చదువుకొని ప్రయోజ కులు కావాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనంచేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, కమిషనర్ ఎస్.రామారావు, ప్రిన్సిపాల్ కె.నర్సింహమూర్తి, మండల ప్రత్యేకాధికారి పి.చంద్రశేఖర్, ఎంపీడీవో వసంత కుమార్, టీడీపీ నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు బడ్డ నాగరాజు, సప్ప నవీన్, టంకాల రవిశంక ర్‌గుప్తా, జోగ మల్లి తదితరులు పాల్గొన్నారు.



పలాస: మధ్యాహ్న భోజన పథకం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

చదువు మీది.. ఉద్యోగ బాధ్యత నాది: రవికుమార్

ఆమదాలవలస, జనవరి 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాధ్యతగా చదువుకుంటే ప్రతి ఒక్కరికి ఉద్యోగం కల్పించే బాధ్యత నేను తీసుకుంటానని ఎమ్మెల్యే కూన రవికుమార్ స్పష్టం చేశారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని ఆయన ప్రారంభించారు. గత వైసీపీ పాలనలో ఫేక్ చదువు సర్టిఫి కెట్లతో పాలనసాగించిన జగన్‌రెడ్డి ఉపాధి కల్పించడంలో నిర్లక్ష్యం వహించారన్నారు. కూటమి ప్రభుత్వంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడం లక్ష్యంగా పరిపాలన సాగుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. సీఐ పి.సత్యనారాయణ, ఎస్ఐ బాలరాజు ఎమ్మెల్యే చేతుల మీదుగా సంకల్పం పోస్టర్‌ను ఆవిష్కరించారు. తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీవో వెంకటరావు, ప్రిన్సిపాల్ శ్యాంసుందర్, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతా సాగర్, నాయకులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి: ఎంపీ, ఎమ్మెల్యే

రణస్థలం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని వారు ప్రారంభించారు. ప్రతి విద్యార్థికి ఇంటర్మీడియెట్ కీలకమని, ఈ దశలో చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులతో కలిసి వారు భోజనం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.ప్రసాద్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.సింహాచలం, కూటమి నేతలు డీజీఎం ఆనందరావు, లంక శ్యామలరావు, పిసిని జగన్నాథంనాయుడు, దన్నాన మహేష్‌తో పాటు కూటమి నేతలు పాల్గొన్నారు.



రణస్థలం: విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న విజయనగరం ఎంపీ కలిశెట్టి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఈఆర్

మధ్యాహ్న భోజనాన్ని వినియోగించుకోవాలి: కలమట

కొత్తూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకట రమణ అన్నారు. నివగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ పథకాన్ని శనివారం ప్రారంభించారు. విద్యార్థులకు స్వయంగా భోజన పదార్థాలను వడ్డించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, టీడీపీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.




ఆమదాలవలస, నరసన్నపేట కళాశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యేలు రవికుమార్, రమణమూర్తి



కొత్తూరు: విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట

ఎన్టీఆర్ కాలనీలో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

టెక్కలి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్ వెనుకభాగంలో ఎన్టీఆర్ కాలనీ ప్రాంతంలో పలు ఆక్రమణలను రెవెన్యూ అధికారులు శనివారం తొలగించారు. ఈ ఆక్రమణలపై వరుసగా వస్తున్న ఫిర్యాదుల మేరకు తహసీల్దార్ దిలీప్ చక్రవర్తి స్పందించి ఎక్స్‌కవేటర్ సాయంతో ఆక్రమణలను తొలగించారు. అలాగే పాత జాతీయ రహదారి వద్ద కూడా ఆక్రమణలపై దృష్టి సారించామని, ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థి దశలోనే లక్ష్యం ఏర్పాటు చేసుకోవాలి

టెక్కలి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తాము చదువుకున్నప్పుడే ఓ లక్ష్యాన్ని ఏర్పరుచుకుని ఆ దిశగా పయనించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ ఎ.విజయ్‌కుమార్ అన్నారు. శనివారం గోపినాథపురం ఐటీఐలో సంకల్పంలో భాగంగా అవగాహన కలిగించారు. ఆయన మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనం నడపడం, అతివేగంగా ప్రయాణించడం, త్రిబుల్‌రైడ్ చేస్తే చర్యలు తప్పవన్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి

పలాస, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రతి ద్విచక్ర వాహనదారు హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ కోరారు. ఈ మేరకు శనివారం పలాస ఇందిరా జంక్షన్ నుంచి కాశీబుగ్గ మూడురోడ్ల జంక్షన్ వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనేక రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా మరణాలు హెల్మెట్‌లు లేని కారణంగానే జరుగుతున్నాయని, ప్రజలు స్వీయ రక్షణ పొందాలని, వాహనాలు స్పీడుగా నడపవద్దని కోరారు.

గ్రిగ్స్ పోటీల్లో పలాస జట్టుకు చాంపియన్‌షిప్

పలాస, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పలాస నియోజకవర్గ గ్రిగ్స్ పోటీల్లో చాంపియన్‌షిప్‌ను పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ఈ మేరకు వారికి శనివారం స్కూల్ ఆవరణలో అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డి.దాశరధి, పి.చిట్టిబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు పి.తవిటయ్య, బి.శంకరరావు, ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముగిసిన బాలుర గ్రిగ్స్ పోటీలు

పోలాకి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మబగాంలోని నిర్వహిస్తున్న నియోజకవర్గస్థాయి బాల, బాలికల గ్రిగ్స్ పోటీలు శనివారంతో ముగిశాయి. హెచ్‌ఎం రాధాకృష్ణ ఆధ్వర్యంలో శనివారం పరుగుపందెం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శాంతి, ఎంపీటీసీ భైరిరాజేశ్వరి, పీఈటీలు, పీడీలు, బాలబాలికలు పాల్గొన్నారు.

విజిలెన్స్ విభాగం ఓఎస్‌డీగా కింజరాపు ప్రభాకర్



కోటబొమ్మాళి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఓఎస్‌డీగా రిటైర్డ్ ఏఎస్పీ కింజరాపు ప్రభాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభాకర్ విశాఖపట్నంతో పాటు పలు ప్రాంతాల్లో ఏఎస్పీగా పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ఈయన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు సోదరుడు కాగా కేంద్ర మంత్రి రామ్మోహన్‌కు బాబాయ్. సుదీర్ఘ కాలం పాటు పోలీసు శాఖలో వివిధ హోదాల్లో సేవలందించిన ప్రభాకర్‌ను ఓఎస్‌డీగా కాంట్రాక్ట్ పద్ధతిలో ఏడాది పాటు పనిచేసేందుకు ఈ నియామకం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

అత్యాచారం కేసులో వ్యక్తి అరెస్టు

లావేరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అత్యాచారం కేసులో బొంతుపేట గ్రామానికి చెందిన మండల లక్ష్మణరావును అరెస్టు చేసినట్టు జేఆర్‌పురం పీఐ ఎం.అవతారం తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. గత నెల 26న మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిపై లక్ష్మణరావు అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో ఆమె లావేరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ అవతారం విచారణ చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం అతడికి రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు.

మద్యంతో వ్యక్తి..

సోంపేట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): జింకిభద్ర జంక్షన్ వద్ద మద్యం అమ్ముతున్న శ్యామసుందర్‌ను అరెస్టు చేసినట్టు ఎస్ఐ లవరాజు తెలిపారు. శనివారం ఉదయం నిర్వహించిన తనిఖీ ల్లో పట్టుబడ్డాడని.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ధాన్యం కొనుగోలుపై స్పష్టత ఇవ్వండి

● మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు

కోటబొమ్మాళి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలుపై స్పష్టత ఇవ్వాలని పలువురు సభ్యులు కోరారు. శనివారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ రోణంకి ఉమ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాసాహెబ్ పేట సర్పంచ్ ఎస్.హేమసుందరరాజు మాట్లాడుతూ.. ధాన్యం అమ్మకాల్లో అనుమతులి వ్వాలని రైతులు విన్నవించుకుంటున్నా ప్రభుత్వ లక్ష్యం మా సచివాలయం పరిధిలో పూర్తయిందని సిబ్బంది చెబుతుండడంతో రైతులు ఆవేదనకు గురవుతున్నారన్నారు. ఉన్నతాధికారులకు విన్నవించామని, తదుపరి చర్యలు తీసుకుంటామ ని చెబుతున్నారని, దీనిపై స్పష్టత ఇవ్వాలని వ్యవసాయాధికారి ఎస్.గోవింద రావును కోరారు. ఈ నేపథ్యంలో టీడీపీ, వైసీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌ల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేప థ్యంలో పోలీసులు కలుగజేసుకోవడంతో వివాదం సద్దుమణిగింది. ఏవో కలుగు జేసుకొని దీనిపై తాము ఉన్నతాధికారులకు కూడా నివేదిస్తామని ఆందోళన చెందవద్దన్నారు. ప్రతిగింజా కొనుగోలు చేస్తామని సమా ధానం ఇచ్చారు. వైస్ ఎంపీపీ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఒడిశా నుంచి ధాన్యం దిగుమతి అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొనడంతో ఈ విషయం తన దృష్టికి రాలే దని సీఎస్‌డీటీ రామ చంద్రరావు బదులిచ్చారు. అలాగే వివిధ సమస్యలపై సభ్యులు ప్రస్తావిం చగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు సమాధానమిచ్చారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.



ప్రజాప్రతినిధుల మధ్య వాగ్వాదం

అభ్యుదయ రైతు దంపతులకు పురస్కారం



వెంకటరమణ దంపతులను సత్కరిస్తున్న రాష్ట్ర వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు

సంతబొమ్మాళి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురానికి చెందిన అభ్యుదయ రైతు తంగి విజయ వెంకటరమణ దంపతులకు గుంటూరు జిల్లా వడ్లమూడి విజ్ఞాన్ వ్యవసాయ యూని వర్సిటీలో శనివారం సత్కరించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా అభ్యుదయ రైతులకు పురస్కారాలు అందించే కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సత్కరించి అభినందించారు. ఎరువులు వాడకుండా సేంద్రియ పద్ధతిలో పంటలను పండిస్తుండడంతో పాటు ఇతర రైతు లకు ఈవిధానంపై అవగాహన కలిగిస్తున్నందుకు గుర్తించి ఈ పురస్కారం అందించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ ఛైర్మన్ లావు రత్తయ్య, గుంటూరు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోదాదేవికి సారె సమర్పణ



గోదాదేవికి వివిధ రకాల వంటకాలతో సారె

టెక్కలి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ధనుర్మాసోత్సవాల్లో భాగంగా రంగనాథుని వివాహమాడేందుకు దీక్ష చేస్తున్న గోదాదేవికి శనివారం భక్తులు 51 రకాల వంటకాలు, సామగ్రితో సారెను సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వేంకటేశ్వర భక్త బృందం ప్రతినిధులు మేళతాళాలు, చిన్నారుల కోలాట ప్రదర్శన మధ్య సారెతో ఆలయానికి చేరుకొని అమ్మ వారికి అందజేశారు. ఈ సందర్భంగా అర్చకుడు రమణాచార్యులు ప్రత్యేక పూజలు చేయడతోట పాటు తిరుప్పావై చదివి వినిపించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మండలస్థాయి ప్రతిభ పరీక్షలో కణితివూరు విజేత

నందిగాం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం ఆధ్వర్యంలో శనివారం మండల స్థాయిలో నిర్వహించిన ప్రతిభ పరీక్షల్లో కణితివూరు జడ్పీ ఉన్నత పాఠశాల జట్టు విజేతగా నిలిచింది. నందిగాం ఉన్నతపాఠశాలలో జరిగిన ఈ పరీక్షల్లో దేవుదళ, రౌతుపురం ఉన్నత పాఠశాలల విద్యార్థులు వరుసగా రెండు, మూడు స్థానాలను పొందారు. ఎంఈవో ఎ.చిన్నారావు, ఫోరం ప్రతినిధులు లక్ష్మీపతి, రామారావు, అప్పల స్వామి, శ్రీనివాసరావు, హెచ్‌ఎంలు వై.హరిబాబు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ● సంతబొమ్మాళి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టాలెంట్ టెస్ట్ శనివారం నిర్వహించారు. మండలంలోని 11 హైస్కూళ్ల నుంచి విద్యార్థులు హాజరుకాగా సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వీరు శ్రీకాకుళంలో జరిగే జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్‌కు హాజరవుతారని హెచ్‌ఎం కామ రాజు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

అంధుల ఆరాధ్యుడు బ్రెయిలీ

హరిపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అంధుల ఆరాధ్యుడు లూయీ బ్రెయిలీ అని ఎంఈవో మర్రిపాటి లక్ష్మణరావు అన్నారు. హరిపురం భవిత కేంద్రంలో శనివారం బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంధుల కోసం లిపిని తయారు చేసి వారిలో వెలుగులునింపారని కొనియాడారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు కె.ప్రసాదరావు, అంబిక, ఉపా ధ్యాయుడు ప్రభాకర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రీడల్లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

టెక్కలి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల డిప్లమో విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ మైదానంలో జరిగిన పోటీల్లో కబడ్డీ, బ్యాడ్మింటన్, పరుగు పందెం పోటీల్లో పాల్గొని ప్రతిభ ప్రదర్శించారన్నారు. ఈనెల 28, 29, 30 తేదీల్లో విశాఖలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. విద్యార్థులను డిప్లమో డీడీ బి.శ్రీనివాసరావు, అధ్యాపకులు అభినందించారు.

న్యూస్ బాక్స్

నీలమణిదుర్గ ఆలయ ఆదాయం రూ.6.89 లక్షలు

పాతపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నీలమణి దుర్గ అమ్మవారి ఆలయానికి 78 రోజులకు రూ.6,89, 757 ఆదాయం వచ్చినట్లు ఈవో టి.వాసుదేవరావు తెలిపారు. ఈ మేరకు శనివారం దేవ దాయ శాఖ ఏసీ కార్యాలయ ప్రతినిధి రవికుమార్ పర్యవేక్షణలో హుండీలను తెరిచి లెక్కించారు. కార్యక్రమంలో అర్చకులు టి.రాజేష్, టి.హరీష్, టి.సతీష్, వేంకటేశ్వరస్వామి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోండి

పాతపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సమయాన్ని సద్వినియోగం చేసుకో వాలని సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా సమన్వయాధికారి ఎస్.బాలాజీ అన్నారు. స్థానిక డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్రమపాఠశాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా పది, ఇంటర్మీడియట్ విద్యా ర్థులతో మాట్లాడారు. పరీక్షలు దగ్గరవుతున్నందున ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.అర్చన, అకడమిక్ టీం సభ్యులు కె.రామ్మూర్తి, కె.నీలాద్రి, జె.యోగేశ్వరరావు, డి.సుదర్శన రావు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతో అభివృద్ధి

నరసన్నపేట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతో అభివృద్ధికి బాటలు వేయడం జరుగుతుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం చిన్నబొరిగివలస నుంచి పోలాకి వరకు సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శిమ్మ చంద్రశేఖర్, నేతలు తంగి తారకేశ్వరరావు, దామోద నర్సింహులు, ఎంపీడీవో మధుసూదనరావు, పంచాయితీరాజ్ డీఈఈ సత్యంనాయుడు, ఏఈ బగ్గు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పోలాకి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొల్లివలస మబగాం రహదారి, బార్జిపాడు, రహిమాన్‌పురం, ప్రియాగ్రహారం పంచాయతీ తెల్లవానిపేట, కాకినాడపేట బీటీ రహదారులకు శనివారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో రవికుమార్, మండల ఇంజనీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీని ప్రభుత్వం నిర్వీర్యం చేసింది: మాజీ మంత్రి



పలాస, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. శనివారం స్థానిక జీఎంఈ కాలనీ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. తమ ప్రభుత్వంలో పైసా ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీ సేవలు అందించామన్నారు. కొత్త ఆరోగ్యశ్రీ విధివిధానాలు రాష్ట్ర మంత్రి రెండు రోజుల కిందట ప్రకటించారని, దీనివల్ల 2.50 లక్షలు బీమా కింద, మిగిలింది ట్రస్టు ద్వారా ఇస్తారని తెలిపారన్నారు. దీనివల్ల ఎవరికి ప్రయోజనం కలుగు తుందో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు.